క్లుప్తంగా

రేపటి నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు

బల్లికురవ: ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు మంగళవారం నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు–2 పరీక్షలు నిర్వహించాలని ఎంఈవో 2 కె. రమేష్‌బాబు ప్రధానోపాధ్యాయులను ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు, 6,7,8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం ఒక పరీక్ష 6వ తేదీ వరకు నిర్వహించి మూల్యాంకనం తదుపరి 10వ తేదీన ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని వివరించారు.

నేడు వైదన, కొప్పరపాడులో గుండె వైద్య శిబిరం

బల్లికురవ: గాంధీ జయంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు గుండె పరీక్షలు చేసేందుకు సోమవారం ఉదయం వైదనలో, సాయంత్రం కొప్పరపాడులో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ పంచాతీల సర్పంచ్‌లు మేడా జయలక్ష్మి, బండారు వెంకాయమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు హెల్ప్ వైద్యశాలచే గుండె స్కానింగ్, ఈసీజీ, ఎకో అవసరమైనవారికి యాంజియోగ్రామ్ పరీక్షలు చేస్తారని చెప్పారు. ఆయాసం గుండెదడ, గుండెనొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగటం ఎడమ చెయ్యి లాగటం, ఎక్కువ కాలంగా షుగరు, బీపీ ఉన్నవారు శిబిరాలకు హాజరై పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్‌లు కోరారు.

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు గొప్ప వరం

చిన్నగంజాం: నిరుపేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం గొప్ప వరమని మండలంలోని మున్నంవారిపాలేనికి చెందిన ఈ గోవిందస్వామి అన్నారు. అనారోగ్య కారణంగా ఒంగోలులో వెంకటరమణ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న అతడికి ఆదివారం గ్రామ వలంటీర్ మనోజ్ పెన్షన్ నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం తనలాంటి నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పెన్షన్‌ను ఇంటికి వచ్చి ఇవ్వడం, జగనన్న బీమా యోజన పథకాలు వృద్ధులకు ఎంతో ఉపయోగపడతాయని ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆయన అన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలకు తరలిన ఉపాధ్యాయులు

కారంచేడు: యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు అయిన సందర్భంగా విజయవాడ (కంకిపాడు సమీపంలోని కల్యాణ మండపం)లో నిర్వహించిన స్వర్ణోత్సవాలకు కారంచేడు మండల యూటీఎఫ్ శాఖ పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాల ద్వారా విజయవాడకు వెళ్లారు. ఉపాధ్యాయ సమస్యలపై 50 సంవత్సరాలుగా అలుపెరుగని నిరంతర పోరాటం చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. యూ భవానీప్రసాద్, ఏ శ్రీనివాసులు, షేక్ సుభానీ, కే శైలజ, ఎస్‌కే మీరావలీ, హుస్సేన్‌సాహెబ్ తదితరులు వెళ్లారు.

నేటిలోగా పింఛన్ పంపిణీ పూర్తిచేయాలి

చీరాల టౌన్: ప్రతినెలా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందిస్తున్న వైఎస్సార్ భరోసా పింఛన్లు పంపిణీని మంగళవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో నేతాజీ ఆదేశించారు. ఆదివారం మండలంలోని బుర్లవారిపాలెం, సాయికాలనీ, దేవాంగపురి గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీల్లో ఉన్న 10520 వివిధ రకాల పింఛన్లలో 7520 వరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారన్నారు. మిగిలిన పింఛన్‌దారులకు మూడో తేదీ సాయంత్రంలోగా వలంటీర్లు పంపిణీని పూర్తి చేయాలని ఎంపీడీవో సూచించారు. ఎంపీడీవోతో పాటుగా ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వలంటీర్లు ఉన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం

సంతమాగులూరు (అద్దంకి): గ్రంథ పఠనంతో విజ్ఞానం కలుగుతుందని లైబ్రేరియన్ భాస్కర రెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఆయన చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థుల చేత వివిధ దేశ నాయకుల చరిత్రలు, విజ్ఞానాన్ని కలిగించే కథలను చదివించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు, స్ఫూర్తినిచ్చే కథలు, నాయకుల, సంఘ సంస్కర్తల జీవిత చరిత్రలను చదవాలని చెప్పారు. అప్పుడే వారి బాటలో నడిచి దేశ భక్తి కలిగిన పౌరులుగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న లైబ్రేరియన్ భాస్కరరెడ్డి


దేశాయిపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రూతమ్మ


మేదరమెట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పరిశుభ్రతతో మెరుగైన సమాజం సాధ్యం

- ఉత్సాహంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం
- శుభ్రం చేసిన ప్రజాప్రతినిధులు
- సందడి చేసిన చిన్నారులు

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/జే.పంగులూరు/బల్లికురవ: పరిసరాలు శుభ్రతతో పాటు వ్యక్తిగతంగా శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమంలోని పాల్గొన్ని చీపురు పట్టి చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి అవగాహన కల్పించారు. రోజుకో గంట పాటు పరిసరాల శుభ్రత మీద దృష్టి పెట్టాలని వారు కోరారు.

■ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని జే.పంగులూరు ఎంపీడీవో రామాంజినేయులు అన్నారు. మండల పరిధిలోని పంగులూరు గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలని, ఇంటి ముందు మురుగు నీరు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాం సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ షేక్ బాజి, సర్పంచ్ లక్ష్మీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శ్రమదానం చేశారు. పాఠశాల క్రీడా మైదనంలో చిల్లచెట్లను తొలగించారు. పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ శ్రమదానం చెయ్యాలని సెక్రటరీ, సర్పంచ్ పిలుపునిచ్చారు.

■ మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ ఆధ్వర్యంలో మండలంలోని మేదరమెట్ల సెంటర్‌లో స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ వై.రత్నారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గోనుగుంట్ల నరేష్, ఈవోపీఆర్డీ ఓబులేసు, ఆర్‌డబ్ల్యూ ఎంఆర్‌సీ ఎస్తేర్‌రాణి, ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, ఈవో శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ముక్తేశ్వరం పాఠశాలలో చిల్లచెట్లు తొలగిస్తున్న కార్మికులు

పరిసరాల శుభ్రత మనలో భాగమవ్వాలి..

కారంచేడు/చినగంజాం/యద్దనపూడి/మార్టూరు: పరిసరాల శుభ్రత మనలో భాగమవ్వాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని కారంచేడు, కుంకలమర్రు గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ ఆర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో మొదట అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలతో ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రజలు గ్రామాల్లో స్వచ్ఛందంగా పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయడం వలన దోమల వ్యాప్తి ఎక్కువవుతుందన్నారు. ఇంట్లో చెత్తను గ్రామాల్లో ఎంపిక చేసిన తడి, పొడి చెత్త డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో చెత్తను సేకరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అంజయ్య, కారంచేడు సర్పంచ్ బాలిగ శివపార్వతి, కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, కోఆర్డినేటర్ వంశీ, కావ్య, సచివాలయ కార్యదర్శులు మాధవి, రాజమోహన్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ జనాభా ఎక్కువగా మనదేశంలో పారిశుధ్యం విషయంలో మనం మరింత ముందుండాలని మార్టూరు ఎంపీడీవో క్రిష్ణకుమారి పేర్కొన్నారు. స్థానిక నాగరాజుపల్లి సెంటర్‌లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ భుక్యా శాంతిబాయి, అధికారులు చీపురు పట్టి చెత్తా చెదారాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, రాజానాయక్, సుకుందరావు, గడ్డం మస్తాన్‌వలి, జీ ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు మీరావలి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో..

వేటపాలెం: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంటాయని ఎంపీడీవో రూతమ్మ పేర్కొన్నారు.


కుంకలమర్రులో తడి, పొడి చెత్తలను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

మండల పరిధిలోని దేశాయిపేట, పాపాయిపాలెం గ్రామాల పరిధిలోని పాఠశాలల ప్రాంగణంలో స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ డీ శ్రీ లక్ష్మి, ప్రత్యేక అధికారి పి రామ్‌కుమార్, ఐ కాశీవిశ్వనాథ్, కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లేళ్లశ్రీధర్, వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, కర్ణ ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

చినగంజాం: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని ఎంపీడీవో కె.స్వరూపరాణి అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొని కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల టౌన్: రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు ఉదయం 10 గంటలకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఈపురుపాలెంలో పబ్లిక్ హెల్త్ సెంటర్ వద్ద బాపట్ల పార్లమెంట్ కన్వీనర్ బండారపల్లి హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్ శెట్టి నాగేశ్వరావు, నాశన మణికుమార్, అర్వపల్లి కుమార్, మేడికొండ భరణి రావు, నాసిక శివాజీ, తడవర్తి చంద్ర, కాకర్ల శ్రీ వెంకటేశ్వర్లు, కాకుమను సుబ్బారావు, బీ శ్రీనివాసరావు, అవ్వారు హనుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నగంజాంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు


పాపాయిపాలెంలో చెత్త ఎత్తుతున్న అధికారి


పంగులూరు ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు


ఈపురుపాలెంలో శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రావు


గుండె పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేటపాలెం: స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ వేటపాలెం ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పటల్ గుండె వైద్య నిపుణలచే ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరంలో గుండె వైద్య నిపుణలు కిరణ్, సాయి 140 మందికి ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరం అయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మందని మెరుగైన వైద్య పరీక్షల కోసం విజయవాడ హెల్ప్ హాస్పటల్ కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు, గొల్లపూడి సీతారాం, కార్యదర్శి ఏవి సురేష్‌బాబు, ప్రతి వెంకట సుబ్బారావు, కారంచేటి శివరామకృష్ణ, పొగడ దండ రవికుమార్, కొత్త శ్రీనివాసరావు, నున్నా నాగేంద్రరావు, ఖదీర్‌బాషా, దివి పవన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత


వయోవృద్ధులను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల అర్బన్: వయోవృద్ధులను సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ వారి అనుభవాలతో చెప్పే అంశాలను ఆచరిస్తూ జీవితంలో ముందుకు వెళ్లాలని ప్రముఖ వైద్యులు గుంటుపల్లి సుబ్బారావు అన్నారు. 33వ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం చీరాలలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎ.నాగ వీరభద్రాచారి అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్స్‌కు రాయితీలు ప్రకటించాలన్నారు. రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వృద్ధుల చట్టాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయాలని, జిల్లా స్థాయిలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా సమాజానికి సేవ చేస్తున్న పలువురు వయోవృద్ధులను ఘనంగా సత్కరించారు. అలానే నిరుపేద వృద్ధులకు భోజన ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో న్యాయవాది, మానవత సంస్థ చైర్మన్ బండారుపల్లి హేమంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.రామారావు, షేక్ మునీరుల్లా ఖాన్, ఎంవి రామారావు, మువ్వల శివప్రసాద్, జంపాల గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పర్చూరు (చిన్నగంజాం): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బీవీఆర్ రోటరీ భవనంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ప్రారంభించారు. చీరాల ఏరియా వైద్యశాల డాక్టర్ వీ రాజా సెల్వన్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యవంతులైన వారు 60 ఏళ్లలోపు వారు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. శిబిరంలో రక్తదానం చేసేవారిని తీసుకువచ్చేందుకు రోటరీ సభ్యుడు కోట శ్రీనివాసరావు కృషిని రోటరీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.సదానందరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, రావి సత్యనారాయణ, కొల్లా నరేంద్రకుమార్, దండా శ్రీనివాసరావు, తేళ్ల రమేష్ చంద్ర, పాబోలు వెంకన్న, ల్యాబ్ టెక్నీషియన్ యు.తిరుమలరావు, బి.సుధీర్, సామాజికవేత్తలు అన్నంరాజు సుబ్బారావు, సిహెచ్‌వీ రామప్రసాద్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న రక్తదాతలు

సీనియర్ ఓటర్లకు సన్మానం

చీరాల టౌన్: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చీరాల తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సత్కరించి సన్మానించారు. చీరాల పరిసర ప్రాంతాల్లో 80 ఏళ్లు నిండిన తొమ్మిది మంది సీనియర్ ఓటర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి సన్మానించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వృద్ధులు చిన్న పిల్లలతో సమానమని మలి వయస్సులో ఉన్న వారికి తగినంత ప్రశాంతత, ఆహ్లాదాన్ని అందించాలన్నారు. సీనియర్ ఓటర్లను సత్కరించడం మంచి కార్యక్రమాన్నారు. కార్యక్రమంలో ఈడీటీ ఆది నారాయణ, రీసర్వే డీటీ అర్జున్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు ఉన్నారు.


సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహశీల్దార్ ప్రభాకరరావు

వినాయకా.. మళ్లీ కలుద్దాం


వాడరేవులో నిమజ్జనం చేస్తున్న భక్తులు


గణనాథుడికి చివరి వీడ్కోలు పలుకుతున్న భక్తులు

చీరాల టౌన్: చవితి పందిళ్లలో విశేష పూజలందుకున్న గణనాథుల నిమజ్జనాలు ఆదివారం ముగిశాయి. వివిధ రకాల ప్రసాదాలు అందుకున్న గణేశుడు తల్లి ఒడికి చేరుకున్నాడు. ఈ ఏడాదికి గణేశుడుకి వీడ్కోలు పలుకుతూ గంగమ్మతల్లి ఒడికి చేర్చారు. చీరాల, పర్చూరు, అద్దంకి, నర్సరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన వినాయకులను నిమజ్జనోత్సవాన్ని వాడరేవులోని సముద్ర తీరంలో భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సివిల్, మెరైన్, ఫైర్ పోలీసులు తీరం ఒడ్డున బందోబస్తు నిర్వహించారు. విఘ్నేశుడికి వీడ్కోలు పలికారు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామంలో బెల్ట్ షాపుపై ఎస్సై తిరుపతిరావు ఆదివారం దాడి చేశారు. గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గొట్టిపాటి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నాడు. అతని వద్ద నుంచి 180 ఎంఎల్ డీపీఎల్ లిక్కరు 9 బాటిళ్లను పట్టుకొని సీజ్ చేశాడు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతిరావు మాట్లాడుతూ అక్రమంగా మద్యం నిర్వహిస్తే చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారు పట్టుబడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అక్రమ మద్యం బాటిళ్లతో ఎస్సై తిరుపతిరావు

4న మేదరమెట్లలో ఉరుసు మహోత్సవం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో వెలసిన హజరత్ సయ్యద్ కరిముల్లాషా ఖాదరి 40వ గంధ ఉరుసు మహోత్సవం ఈనెల 4వ తేదీన ఉంటుందని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. 4 రాత్రి 9.45కు గుర్రం మీద స్వాముల వారి గంధంతో పకీరుల మేళతాళాలతో ఊరేగింపు, 5న గంధం ఊరేగింపు, అనంతరం భక్తులకు గంధం పంచడం, 6వ తేదీ గంధం బిందెను భద్రపరచడం వంటి కార్యక్రమాల భక్తుల దీపారాధన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బంధువుల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన మార్టూరులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక గొట్టిపాటి హనుమంతరావు కాలనీకి చెందిన సులేమాన్ గతంలో తమ సమీప బంధువులను ఇబ్బందులకు గురి చేసి దాడులకు పాల్పడిన విషయమై పోలీస్ స్టేషన్లో పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో ఆదివారం గన్నవరం రోడ్డులో వస్తున్న సులేమాన్‌పై నలుగురు యువకులు కత్తితో దాడి చేశారు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో ఉన్న సులేమాన్‌ను స్థానికులు మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సులేమాన్‌ను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి కొని దర్యాప్తు చేస్తున్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

చీరాల రూరల్: రాజ్యాంగం అందించిన చట్టాలను వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హారిస్‌పేట పెట్రోలు బంకు వద్దగల భవాని మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్స్ సిటిజన్స్ హోంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి రెహానా పాల్గొని మాట్లాడారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులను కంటికి రెప్పలా కాపాడాలని సూచించారు. తదనంతరం వృద్ధులకు పండ్లు, పాలు, రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రమేష్ బాబు, ఒన్‌టౌన్ ఎస్సై షేక్ జాని, ఏఎస్సై సత్యనారాయణ, న్యాయవాదులు టి. శకుంతల, ఎ. సతీష్ రెడ్డి, జికె. ఈశ్వరి రెడ్డి, మతీన్, ఆశ్రమ నిర్వహకులు సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, భాద్రపద మాసం, రేవతి నక్షత్రం, తదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న గిరిజా మనోహర్

చీరాల రూరల్: కక్షిదారులకు న్యాయ సహాయం అందించేందుకు రేయింబవళ్లు కష్టపడున్న న్యాయవాదులకు రక్షణ చట్టాలు లేకపోవడం దురదృష్టకరమని, తక్షణమే ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల కోసం రక్షణ చట్టాలను అమలు చేయాలని రిటైర్డు జిల్లా జడ్జి గిరిజా మనోహర్ అన్నారు. చీరాల న్యాయవాదుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక గడియార స్తంభం సెంటర్లోని రావూస్ రెస్టారెంట్‌లో న్యాయవాదుల రక్షణ చట్టాలు, 41 ఏ నోటీసులు గురించి సమావేశం నిర్వహించారు. చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా రిటైర్డు జిల్లా జడ్జి గిరిజా మనోహర్ పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులపై నిరంతరం అట్రాసిటి కేసులు బనాయించడం, అగౌరవపరచడం, మర్డర్ కేసులు పెట్టడం వంటివి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 41 ఏ సీఆర్పీసీ నోటీసుల వలన ముద్దాయిలకు కోర్టులన్నా, న్యాయవాదులన్నా, పోలీసులన్నా భయం లేకుండా పోతుందన్నారు. బాపట్ల జిల్లా అయినందున అక్కడ జిల్లా కోర్టు వస్తుందని, చీరాల కోర్టులలో కేసుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఇక్కడ కూడా ఆదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంకా రిటైర్డు అడిషనల్ జిల్లా జడ్జి సిహెచ్. మాధవరావు, చిత్తూరు జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. ప్రకాష్, ఎంవి. చలపతిరావు, హైకోర్టు న్యాయవాది తాతా సింగయ్య, స్థానిక న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

కారంచేడులో అకాల వర్షం


ఉప్పొంగుతున్న అలుగు

కారంచేడు: ఆదివారం అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు కురిసిన అకాల వర్షంతో అలుగు వాగు ఉప్పొంగి ప్రవహించింది. అడపాదడపా చిరుజల్లులు కురుస్తున్నా పెద్దగా వర్షం లేక అన్నదాతలు సాగు నీటి కోసం అల్లాడుతున్నారు. ఆదివారం వేకువజామున కురిసిన అకాల వర్షంతో మండలంలోని తిమిడెదపాడు, కేశవరప్పాడు గ్రామాల మధ్యన ఉన్న అలుగు వాగు రోడ్డుపైకి వచ్చి ప్రవహించింది. సాధారణ వర్షమే అనుకున్న రైతులకు అలుగు వాగు రోడ్డుపైకి ప్రవహించడం చూసి అవాక్కయ్యారు. ఊహించని విధంగా కురిసిన అకాల వర్షంతో మెట్ట ప్రాంత రైతులు కొంత వరకు ఊపిరి పీల్చుకున్నారు.